మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీ వద్ద జగనన్న లేఔట్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో షాదీ ఖానా నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్ మైనార్టీలకు అన్ని విధాలా లబ్ధి చేకూర్చిందన్నారు. దూదేకుల కులస్తుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫెడరేషన్ తీసుకువచ్చారని గుర్తు చేశారు. పెనుకొండ బాబయ్య దర్గా అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేశారని, త్వరలో ప్రతి నియోజకవర్గానికి మైనార్టీ వెల్ఫేర్ ఫండ్ కోసం ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇమామ్, మౌజనాలకు వేతనాలు పెంచడంతో పాటు వక్ఫ్‌బోర్డు కమిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని మాట్లాడుతూ టీడీపీ హయాంలో మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూశారు తప్ప వారి అభ్యున్నతికి కృషి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీకు కనీసం మంత్రి పదవి కూడా కేటాయించాలని, కానీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ కుళ్లాయప్ప, అబ్దుల్ ఇమామ్ వలి, అన్సార్, ఇర్ఫాన్, ముహమ్మద్, దస్తగిరి, బాబు, అక్బర్, నజీర్, తల్హాఖాన్ తదితరులు పాల్గొన్నారు.


షాదీఖానా నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర నారాయణ

పెనుకొండ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. ఆదివారం సోమందేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద రూ.87 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్ లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం రూ.475 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కేతగాని చెరువు నుంచి సోమందేపల్లి వరకు దాదాపు రూ.14 కోట్లతో డబుల్ రోడ్ పనులు పూర్తి చేయడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా పెనుకొండలోని బాబయ్య స్వామి చెరువు ఆధునీకరణ కోసం రూ.94 లక్షల నిధులు గత రెండు రోజుల క్రితం విడుదల అయ్యాయని తెలిపారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా జగనన్న కాలనీల ద్వారా అర్హులందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, సింగిల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కొల్లప్ప, సర్పంచ్ అంజి నాయక్, ఎంపీటీసీ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు


అమరాపురం: అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన బెంగళూరు, మైసూర్, శిర, హిరియూర్, మధుగిరి, చెళకెర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్లలో...

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విగ్రహానికి గంగా జలంలో అభిషేకం చేశారు. తర్వాత వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు తయారు చేసి దేవుని ప్రతిమ ఎదుట నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కోడూరులో పోలీసుల సోదాలు

చిలమత్తూరు: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని కోడూరు, కనిశెట్టిపల్లి గ్రామాల్లో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పలు దుకాణాలు తనిఖీ చేసిన ఆయన కర్ణాటక మద్యం, గుట్కా వంటి నిషేధిత ద్రావకాలు, పదార్థాలను విక్రయించకూడదని దుకాణాదారులను హెచ్చరించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ప్రజలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఆదివారం హిందుపురం పట్టణానికి చెందిన వైద్యులు చంద్రకిరణ్‌రెడ్డి, హరీష్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అదే విధంగా వృద్ధులకు స్వెటర్లను అందించారు. అనంతరం రూ.20 వేలు విలువ చేసే బియ్యం, వంటనూనె, చక్కెర, బెల్లం తదితర వంట సామగ్రిని నిర్వాహకులు తిమ్మారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సురేష్‌రెడ్డి , సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మార్పణ దినోత్సవం

అమరాపురం: ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మండల కేంద్రమైన అమరాపురంలో సోమవారం నిర్వహించనున్నట్లు అర్చకులు నరసింహభట్టాచార్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

నేడు 'స్పందన'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహం 1 గంట వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఏఓ ఆరాధ్య తెలిపారు.

అపూర్వ సమ్మేళనం


కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1981–82 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత దాదాపు 30 మంది మిత్రులంతా ఒక్కచోట కలవడంతో ఆ పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి సంగతులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు.

ప్రారంభానికి సిద్ధమైన కరియమ్మ ఆలయం


నూతనంగా నిర్మించిన కరియమ్మ దొడ్డగాటమ్మ ఆలయం

అమరాపురం: మండలంలోని హాలుకూరు గ్రామ పొలిమేరలో వెలసిన దొడ్డగాటమ్మ, కరియమ్మ దేవాలయ నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 25 నుంచి 27 వరకూ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హాలుకూరు పంచాయతీ పరిధిలోని హాలుకూరు, కాచికుంట, ఉదుగూరు, చిట్నడకు గ్రామస్తులకు గ్రామ దేవతగా దొడ్డగాటమ్మ కరియమ్మ దేవతలు ఉన్నారు. రూ.40 లక్షలు వెచ్చించి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 25 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం ఆలయ ఆవరణలో నూతనంగా చిట్నడకు యాదవ కులస్తుల ఆధ్వర్యంలో తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ అర్చకులు గురుదేవప్ప, ఉపాధ్యక్షుడు కాంతరాజు, కార్యదర్శి రామప్ప తెలిపారు. 25న నూతనంగా తయారు చేయించిన దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన జరుపనున్నట్లు వారు పేర్కొన్నారు. 25న గంగ పూజ, ధ్వజారోహణ, గణపతి పూజ, 26న నవగ్రహ పూజ, గ్రామ దేవతలకు హోమం, నూతన దేవాలయం శిఖరం కలశ స్థాపన, 27న దొడగాటమ్మ, కరియమ్మల దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా యోగి వేమన విగ్రహావిష్కరణ


యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

హిందూపురం: రెడ్డి కులస్తులు సామాజిక సేవా అభివృద్ధి కార్యక్రమాల్లో స్ఫూర్తికారులుగా ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు. వేమారెడ్డి జయంతి కార్యక్రమాల్లో భాగంగా బసవపల్లి సమీపంలోని సడ్లపల్లి క్రాస్ వద్ద రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మహాకవి యోగి వేమన విగ్రహ ఆవిష్కరణ జరిగింది. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి సడ్లపల్లి క్రాస్ వరకు మెయిన్‌రోడ్డు మీదుగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, బలరామిరెడ్డి, వేణురెడ్డి, రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, సునీతా రెడ్డి, మారుతీరెడ్డి, శ్రీరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డితో పాటు ఆ సంఘం నాయకులతో కలసి మహాకవి యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కులబంధువుడు యోగి వేమన కుల మతాలకు అతీతంగా సంప్రదాయలు, ఆచార వ్యవహారాలకు భిన్నంగా వ్యవహరించిన సంఘ సంస్కకర్త అని కొనియాడారు. మానవసేవే మాధవ సేవని జీవిత సత్యాన్ని చాటి చెప్పారన్నారు. ఆయన చూపిన మార్గంలో పార్టీలకు అతీతంగా రెడ్డి సంఘ నాయకులు ఐక్యమత్యంతో కలిసికట్టుగా సంఘ అభివృద్ధితో పాటు ఇతర కులస్తులతో కూడా కలిసి మెలిసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగివేమన, భగిరథుడు, కనకదాసు, అంబేద్కర్ లాంటి మహానుభావులు ఒక కులానికి కాదని, మానవళి అందరికీ స్ఫూర్తిప్రదాతలన్నారు. అగ్ర వర్ణాల్లో కూడా పేదలున్నారని, వారందరినీ ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్డి కులస్తుల విద్యార్థుల కోసం త్వరలోనే రెడ్డి స్టూడెంట్స్ హాస్టల్‌తో పాటు కళ్యాణ మంపడం నిర్మాణాలకు శ్రీకారం చేడతామన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘ నాయకులు శివారెడ్డి, కొడిపి హనుమంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పరమేష్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి


ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి సంబంధించిన ఎన్నికల ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే తిప్పేస్వామి మడకశిరలో ఆదివారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వెన్నపూస రవీంద్రారెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ జయరామప్ప, రొళ్ల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, ఎంపీపీ కవిత, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, రంజిత్, దేవరాజ్‌యాదవ్, అంబరీష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రొద్దం: క్రీడలతో పిల్లల్లో మానసికోల్లాసం కలుగుతుందని చిగురు కార్యక్రమం కో–ఆర్డినేటర్ వై.రామన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టింబక్టు–కలెక్టివ్, చిగురు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతశక్తి సొసైటీ ప్రాంగణంలో విద్యార్థులకు ఆటల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చిగురు సీఈఓ రామన్న , కల్పివల్లి సీఈఓ చిరంజీవి, అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య తదితరులు మాట్లాడుతూ ఆటల పోటీలతో పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు శారీక ఎదుగుదలకు బాగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు.

నాణ్యత పాటించండి

పావగడ: రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పది కాలాల పాటు నిలిచేలా రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప సంబంధిత కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు సూచించారు. తాలూకాలోని బ్యాడనూరులో రూ.50 లక్షలతో నిర్మించే బ్యాడనూరు–కిలార్లహళ్లి రోడ్డు పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం బి.దొడ్డహట్టి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, హరీశ్, మైలప్ప, వేణుగోపాల రెడ్డి, బీఈఓ అశ్వర్థనారాయణ, జెడ్పీ ఏఈఈ సురేశ్, జేఈ బసవలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మొదటి ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా దుగ్గమ్మ



పావగడ: తాలూకాలోని కురుబరహళ్లి గ్రామానికి చెందిన దుగ్గమ్మ దేశంలోనే మొట్ట మొదటి ఎలక్ట్రిక్ బస్సు మహిళా డ్రైవర్‌గా ఎంపికయ్యారు. కురుబ భీమప్ప, రామలక్ష్మమ్మ దంపతుల కుమార్తె అయిన దుగ్గమ్మ ప్రస్తుతం బీఎంటీసీ (బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్) డ్రైవర్ పనిచేస్తున్నారు. బెంగుళూరు నగరంలో ఎంతో ధైర్యంగా డీజిల్ బస్సును నడుపుతూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఉత్తమ మహిళా డ్రైవర్‌గా ప్రశంసలందుకున్నారు. ఈ నేపథ్యంలో దుగ్గమ్మను ఎలక్ట్రిక్ బస్సు మహిళా బస్సు డ్రైవర్‌గా రవాణాశాఖ ఎంపిక చేసింది. శిక్షకులు అశోక్ ఉత్తప్ప, పరమేశ్ ఆధ్వర్యంలో ఆమెకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పావగడ తాలూకాలోని మారుమూల గ్రామం కురుబరహళ్లిలో జన్మించిన దుగ్గమ్మ నేడు దేశంలోనే మొదటి ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్‌గా ఎంపికకావడంతో పావగడ తాలూకా ఖ్యాతి దేశ వ్యాప్తంగా ఇనుమడింప చేసిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శనీశ్వరా పాహి.. పాహి


రొద్దం: పావగడకు బయలుదేరిన భక్తులు


పావగడ: శనీశ్వరాలయం వద్ద భక్తుల సందడి

పావగడ: పట్టణంలో వెలసిన శనీశ్వరస్వామి దర్శనార్థం ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రధాన రహదారులన్నీ కిటకిటలాడాయి. ఆలయంలోని శనీశ్వర స్వామిని దర్శించుకుని భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. పలువురు హోమాలు నిర్వహించారు. ఇదిలా వుంటే అమవాస్య రోజున శని మహాత్ముడు మకరరాశి నుంచి కుంభరాశికి ప్రవేశించడంతో శని దోషాలు, ఏల్నాటి శని దోషాలను తొలగించుకోవడం కోసం స్వామిని దర్శించుకోవడానికి వచ్చినట్లు భక్తులు తెలిపారు. ఆలయ సమితి అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్, పదాధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ గురుమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పావగడకు పాదయాత్ర

రొద్దం: మాఘమాసంలో శనీశ్వరున్ని దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో భక్తులు పెద్ద సంఖ్యలో పావగడకు పాదయాత్ర చేశారు. ఆదివారం ఉదయం మండల కేంద్రం రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయం నుంచి అర్చకులు గిరీష్‌స్వామి సమక్షంలో శ్రీరామ యువజన భక్త మండలి ఆధ్వర్యంలో దాదాపు నాలుగు వేల మంది భక్తులు 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని పావగడ శనీశ్వరాలయానికి పాదయాత్రగా చేరుకున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: రోడ్డు ప్రయాణంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణాసాగర్ , డీఎస్పీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ వాహనచోదకులు చాలా మంది హెల్మెట్ ధరించడం లేదని, మద్యం సేవించి వాహనం నడపడం, గుట్కా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎక్కువై అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఆ కుటుంబాలు చితికిపోతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

రేపు కల్లూరులో చేపల వేలం

లేపాక్షి: మండలంలోని కల్లూరు పంచాయతీ కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 11 గంటలకు చెరువులో చేపల పెంపకం కోసం వేలం జరుగుతుందని సర్పంచ్ వసుంధర ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ నిర్ణయించిన ధరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని మదిగుబ్బ చెరువు, కొంకల్లు పంచాయతీ పరిధిలోని కొంకల్లు చెరువులో చేపల పెంపకానికి సంబంధించి ఈనెల 24న ఓఆర్‌డీ నాగరాజునాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు గోవిందప్ప, రమేష్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరావత్తు రూ.10,000 చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం సచివాలయం పరిధిలోని బుళ్లసముద్రం గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, సర్పంచ్ రంగమ్మ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారని అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళాలు

లేపాక్షి: మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి దాతలు ఆదివారం విరాళాలను కమిటీ సభ్యులకు అందజేశారు. లేపాక్షికి చెందిన నలినాక్షి, శివకుమార్ రూ.11,111, ఈడిగ శ్రీనివాసులు రూ.10,116, బింగిపల్లికి చెందిన శివారెడ్డి రూ.10.016, సుబ్బిరెడ్డిపల్లికి చెందిన బ్రహ్మానందరెడ్డి రూ.10,116, మామిడిమాకులపల్లికి చెందిన ఈడిగ లక్ష్మినారాయణ రూ.10 వేలు, లేపాక్షికి చెందిన గంగప్ప రూ.5 వేలు విరాళం అందజేశారు.

పండ్ల తోటల పరిశీలన

రొద్దం: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు సాగు చేసిన పండ్ల తోటలను ఆదివారం ఏపీడీ జయసింహ పరిశీలించారు. మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పండ్ల తోటలు సాగు చేస్తే వారికి వచ్చే ఆదాయాలను వివరించారు. అదేవిధంగా ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామాల్లో కూలీలకు పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కూలీల బిల్లు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన


కలశాలను స్థాపన చేసిన దృశ్యం

అమరాపురం: మండలంలోని చిట్నడకు గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలశ స్థాపన కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శివరం, కెంకెర, చిట్నడకు, కాచికుంటలోని యాదవ కులస్తులు గ్రామ పొలిమేరలో ఉన్న వంక వద్దకు వెళ్లి గంగ పూజ చేశారు. అక్కడి నుంచి కలశాలను గంగా జలాన్ని భక్తులు గ్రామ వీధుల గుండా నూతనంగా నిర్మించిన నాగుల కట్ట వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు ప్రత్యేకంగా నవగ్రహ, శాంతి, హోమాలను నిర్వహించారు. అనంతరం కలశాలను స్థాపన చేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని చిట్నడకు గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడి కన్నుమూత


రమాకాంతశర్మ (ఫైల్)

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం మాజీ ప్రధాన అర్చకుడు రమాకాంతశర్మ(66) ఆదివారం ఉదయం 8 గంటలకు అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం లేపాక్షి ఆలయ అర్చకులుగా రమాకాంతశర్మ కుమారుడు లక్ష్మీనరసింహాశర్మ పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చలిగింత

పట్టణంలో చలితీవ్రత కొనసాగుతోంది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత తగ్గడంలేదు. దీంతో అందరూ స్వెటర్లు, జర్కిన్లు వేసుకొనే బయటకు రావాల్సిన పరిస్థితి. ఇక.. ఉదయాన్నే పనుల కోసం వెళ్లే వారు చలితీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.

– హిందూపురం:


బైపాస్ రోడ్డును పొగమంచు కప్పేసిన దృశ్యం